
కథా నిలయం
శ్రీకాకుళం



# సలహా

**దొరవేటి**

"నా కభ్యంతరం లేదు..." నవ్వు, సిగ్గూ పోటీపడ్డాయి కౌస్తుభ మొహంలో.

అసలే షో పీస్‌లా ఉండే కౌస్తుభ, ఆ క్షణం సినిమా హీరోయిన్ కంటే అందంగా కనిపించింది.

దగ్గరగా జరిగి, భుజం చుట్టూ చెయ్యి వేసి-"ఐ...లవ్...యూ..." అన్నాను ఆమెకు మాత్రమే వినబడేట్టు.

"ఐ... టూ.. లవ్... యూ..." నన్నే అనుకరిస్తూ, అల్లుకుపోయింది కౌస్తుభ.

మరింత గట్టిగా ఆమెను హత్తుకోయాను... అంతే!!!

"ఏమైందండీ?" గట్టిగా అరిచింది లలిత, భార్యామణి. కళ్లు తెరిచి చూశాను.

బెడ్ లైట్ వెలుగులో-మంచమ్మీద కూర్చొని ఉంది లలిత. జుట్టు సరిగ్గా ముడేసు కోలేదేమో, ఊడిపోయి మొహం నిండా పరుచుకున్నాయి వెంట్రుకలు. అవి ఫ్యాన్ గాలికి కదుల్తూంటే 'సినీచంద్రముఖి' గుర్తొచ్చింది.

ఒక క్షణం ఉలిక్కిపడ్డాను.

నిద్ర ఎగిరిపోయింది. నేనున్నది పార్కులో కాదు, నా పక్కన కౌస్తుభ లేదు. అది సంధ్యాసమయం అసలే కాదని అర్థమయ్యింది. అంతా... కల... దాని మహిమ వల్లే బెడ్ మీద నుండి కింద పడిపోయాననే స్పృహ కలిగింది.

"ఏం కాలేదు... ఏం కాలేదు..." దొరికిన దొంగలా మళ్లీ అర్ధాంగి 'చంద్రముఖి'ని చూడలేక దుప్పటి ముసుగెట్టాను. అప్పుడనిపించింది-'కలలో నేను కలవరించలేదు కదా... అది లలిత గాని వినలేదు కదా...' నాకు తెలియకుండానే గుండె దడదడలాడింది.

ఆపై నిద్ర పట్టలేదు.

'ఈ సమస్యకు వెంటనే పరిష్కారం కనిపెట్టాలి. కౌస్తుభని తన జీవితంలోకి ఆహ్వానించాలా? వద్దా? ఇది ముందు తేల్చుకోవాలి. ఆమె లేందే తన జీవితం అసంపూర్ణం అనే భావన నాలో నానాటికీ బలపడుతోంది. సరిగ్గా కౌస్తుభ కూడా ఇట్లాగే ఆలోచించడం నా ఆలోచనలకు అదనపు బలం. మరి లలిత...?

మరోసారి ఉలిక్కిపడ్డాను. తెల్లారేదాకా అట్లా ఏదేదో ఆలోచిస్తూ, ఉలికులికి పడ్తూనే ఉన్నాను.

ఉదయం శరీరం సహకరించడం లేదనిపించింది. అయినా, కౌస్తుభని చూడాలన్న ఏకైక ఆకాంక్షతో డ్యూటీకి బయల్దేరాను.

"ఏంటీ, డబుల్ డ్యూటీ చేస్తున్నావా?" కనుబొమ లెగరేస్తూ 'ధ్వని' వినిపించాడు, సీనియర్ అసిస్టెంట్ యాస్కి సోమలింగం ఉరఫ్ వై.యస్. లింగం.

ఉలిక్కిపడ్డాను. అలా ఉలిక్కిపడ్డం ఓ జబ్బుగా పరిణమిస్తుందేమోనన్న అనుమానం తలెత్తింది. అసలే డల్‌గా ఉన్నాను. కౌస్తుభ కనిపించకపోయేసరికి మరింత నీరసం పెరిగింది. లింగం 'డబుల్ డ్యూటీ'కి అర్థం ఏమయ్యుంటుందోనని కొట్టుకోసాగాను.

"రాత్రి కౌస్తుభతో కలిసి ఏదైనా రిసార్ట్ కెళ్లావా?" నా టేబుల్ పైకి వంగి నాకు మాత్రమే వినబడేలా అన్నాడు.

మరోమారు ఉలిక్కిపడ్డా. కంగారుగా ఏదో అనబోయాను. అది గమనించలేదో, పట్టించుకోలేదో గానీ, అతను కొనసాగించాడు-"అరే, పోతే మాత్రం తప్పేముంది భాయ్? ఇది మహానగరం. యహాఁ సబ్ చలేగా... చలేగా క్యా, దౌడేగా. అయినా నువ్వు మగాడివి కాదా?"

విస్మయంగా చూశాను వై.యస్. వంక.

"ఏలుకునేవాడికి ఏడుగు'రని మన పెద్దలు ఊరికే సెలవియ్యలేదు భాయ్. వాళ్లు అనుభవంతోనే చెప్పారు..."

ఏదో ధైర్యం, ఇంకేదో ఊత, అంతసేపటి డిప్రెషన్ తొలగిపోతున్న భావన.

"ఏంటీ? ఇంకా మీ మధ్య కనెక్షన్ మొదలవలా?" రెండు చేతుల వేళ్లనూ ఒకదానితో మరొకటి పొడుస్తూ నర్మగర్భంగా అడిగాడు.

"ఉహు... అబ్బే... అలాంటిదేం లేదు..." కంగారుగా, పొడిపొడిగా నేను.

"అరె, ఎందుకలా పరేషాన్ అవుతావు భాయ్? ఆమె వైపు నుండి లైన్ క్లియర్ ఉంటే మాత్రం నువ్వు డిలే చేయొద్దు. అలా చేస్తే నువ్వొత్తి ఛెక్కాగాడివనుకునే ప్రమాదముంది."

మళ్లీ ఉలిక్కిపడ్డాను. ఛెక్కా అంటే నపుంసకుడని తెలుసు.

"చూడు శివా! ఇటువంటి విషయాలు ఎంత తొందరగా ఫైనల్ చేసుకుంటే అంత మంచిది. నాలుగేళ్ల క్రితం మంచాలలో పని చేసేటప్పుడు, మా

ఫ్రెండ్ రమేశ్‌కి ఇటువంటి ప్రాబ్లమే వచ్చింది. ఇట్లాగే ధైర్యమిచ్చాం. ఫినిష్. ఇప్పుడు వాడు ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడై మనల్ని గుర్తు చేసుకోవడం కూడా మరిచిపోయి ఎంజాయ్ చేస్తున్నాడు." తమాషాగా నవ్వాడు లింగం.

నా మొహంలో నవ్వు విరిసింది. అంతసేపటి ఆందోళన, తప్పు చేస్తున్నానేమోనన్న భావనా తగ్గుముఖం పట్టాయి.

"నువ్వు కావాలంటే రేపే మంచాల వెళ్దాం. సాయంత్రం ఓ గంట ముందు పర్మిషన్ తీసుకొని. మనమంటే చాలా గౌరవం వాళ్లకి. అనకూడదు గానీ, దేవుడిలా చూస్తారనుకో." కాలరెగరేశాడు వై.యస్.

000

"రండి! అన్నయ్య గారూ!" సాదరంగా ఆహ్వానించింది ఆమె. లింగం సెటిల్ చేసిన రమేశ్ ద్వితీయార్ధం 'సుమన' అని నాకర్థమైంది.

'చూశావా, ఎంత మర్యాద...?!' అన్నట్లు నా వైపు చూసి నవ్వాడు వైయస్.

నేనూ నవ్వాను కృతకంగా. అదే సహజమై పోయింది కదా ఈ నాటి బతుకులకి. అయినా ఇంటికి వెతుక్కుంటూ వచ్చిన మనిషిని రమ్మనక పొమ్మంటారా ఎవరైనా? పైగా తను వాళ్ల ఆరాధ్యదైవాన్నని తనకు తాను ఖితాబిచ్చుకున్నాడాయె-మా లింగం.

దర్జాగా అతను, బిక్కుబిక్కుమంటూ నేను ఆ ఇంట్లో అడుగుపెట్టాం.

మమ్మల్ని కూర్చోబెట్టి, ఆమె వంటింట్లో కెళ్లింది.

"ఏమ్మా, బావగారు గనిపించట్లేదు. డ్యూటీ నుండి ఇంకా రాలేదా?" అడిగాడు వైయస్.

"వస్తారన్నయ్యా. వచ్చే టైమయ్యింది..." నూతిలో నుండి వస్తున్నట్టుంది సుమన సౌండ్. ఆమె దూరంగా ఉండటంవల్ల అలా అనిపిస్తుంది గాబోలు.

కమ్మని కాఫీ కలిపిచ్చింది. కాఫీ రుచిని బట్టే జీవితం పట్ల ఆమె కెంత మంచి ఊహలున్నాయో అర్థమవుతున్నది.

"కాఫీ చాలా బాగుందండీ!" అభినందించకుండా ఉండలేకపోయాన్నేను.

"మా సిస్టర్ వంటలు సూపర్బ్‌గా ఉంటాయి శివా! ఆమె చేతి మటన్ బిర్యానీ గానీ తిన్నావంటే నిన్ను నువ్వు మరచిపోతావనుకో" అంటూనే గుర్తొచ్చినట్టుంది అతనికి-"అరె... నువ్వు నాన్‌వెజ్ తినవు గదూ! అయినా సరే ఒక్కసారి టేస్టు చూస్తే, ప్యూర్ నాన్-వెజ్‌గా మారిపోతావ్" పెద్ద పెట్టున నవ్వాడు లింగం.

నేనామెను ఓ కంట కనిపెడుతూనే ఉన్నా.

మొదటి కాంప్లిమెంట్‌కి ఇబ్బందిగా నవ్వింది. తర్వాత మాటవరసకైనా ప్రతిస్పందించ లేదు. నేను మాత్రం వైయస్ తృప్తి కోసం ఓ ఆశ్చర్యార్థకం, ఓ చిరునవ్వు అతికించుకున్నాను-మొహానికి.

చూస్తూండగానే అరగంట గడిచింది. నాకు అసౌకర్యంగా ఉంది. సుమన పరిస్థితీ అలాగే ఉన్నట్టుంది. వైఎస్ ఒక్కడే వాగుతున్నాడు.

నేను మాట్లాడలేదు. అతను మాట్లాడకుండా ఉండలేడు. ఆమె ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడటం లేదు.

మరో పది నిముషాల తర్వాత లింగం వాస్తవంలో కొచ్చాడు "ఏమ్మా! ఏడుంపావయ్యింది, బావగారింకా రాలేదు?" ఆమె నడిగాడు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**

"ఒక్కోసారి తొందరగానే వస్తారు. ఒక్కోసారి అర్ధరాత్రి దాకా రారు. రావద్దనుకుంటే రారు కూడా." ఆమె గుండెల్లో చెమ్మ కళ్లలో కనిపించింది.

అలవాటు కొద్దీ ఉలిక్కిపడ్డాన్నేను.

"అరె! ఇదెప్పటి నుండి? ఈ సమయంలో ఎక్కడుంటాడో కాస్త చెప్పమ్మా. ఉతికి ఆరేస్తా..." ఆశ్చర్యం, ఆవేశం-లింగం.

"తెలీదు." ఆమె పొడి సమాధానం వెనుక ఎన్నో అర్థాలున్నాయని పించింది నాకు.

అక్కడి నుండి ఎంత తొందరగా బయటపడితే అంత మేలనిపిస్తూంది.

"ఈయన శివకుమార్. మా ఆఫీసులోనే జూనియర్ అసిస్టెంట్." నన్ను పరిచయం చేశాడు- 'దొంగలు పడ్డ ఆర్నెల్లకు...' అన్న చందాన. "బావగారితో ఇతనికో పనిబడిందంటే తీసుకొచ్చాను." వచ్చిన కారణం 'కట్టు కథ' చెప్పాడు లింగం.

ఆమె కళ్లలో విస్మయం ఒక్క క్షణం. మరుక్షణం భావరహితమై పోయిందామె వదనం.

"ఈ సారి బావగారున్న సంగతి కనుక్కొని వస్తాంలేమ్మా. రాగానే ఓ సారి ఫోన్ చేయించడం మరువకు." తన విజిటింగ్ కార్డు ఆమె చేతికిచ్చాడు లింగం.

అతని నోట్లో మాట నోట్లో ఉండగానే... "సరే!" అనేసిందామె. లేదంటే మళ్లీ మనసు మార్చుకొని, ఇక్కడే తిష్ఠ వేస్తారన్న భయం గాబోలు.

నేను-తరిమేసినట్టు బయటికొచ్చాను.

లింగం కూడా అసంతృప్తిగా బయట పడ్డాడు.

"శివా! ఈ ఆడవాళ్లనర్థం చేసుకోవడం మహాకష్టం భాయ్..." అంటూ అక్కడ ఎదురైన పరిస్థితిని సర్దుకుపోయే ప్రయత్నానికి దిగాడు.

అతని మాటలు నాకాశ్చర్యాన్ని కలిగించలేదు. అది మానవసహజమే కదా! అన్నీ అనుకూలంగా జరిగితే, తన గొప్పతనంగా పొంగిపోతాడు. ప్రతికూలమైతే ఇతరుల మీదికి నెట్టేస్తాడు-అది సాధ్యం కాకపోతే భగవంతుడి మీదికీ. ఎందుకంటే అతనొచ్చి వాదించలేడు మరి!

మంచాల నుండి ఇబ్రహీంపట్నం వచ్చే బస్సు వెంటనే దొరికింది. దాదాపు ఖాళీగా ఉంది. ఆర్టీసీ ఆర్థికస్థితికి అద్దంపడుతూ. టికెట్స్ లింగమే కొన్నాడు. బస్సు బయల్దేరింది. మాకిద్దరికీ ఇష్టమైన కార్యక్రమం మొదలైంది. అదే-వైఎస్‌కి మాట్లాడటం ఇష్టం, ఎదురు మాట్లాడకుండా వినడం నాకిష్టం.

"ఆ అమ్మాయి చాలా అందంగా ఉండేది శివా! ఇప్పుడంత కళావిహీనంగా కనిపిస్తోంది కానీ..."

'నిజమే! భౌతికమైన అందం ఎన్నటికీ శాశ్వతం కాదు గదా!' అనుకున్నానేను.

"ఆ అందాన్ని చూసే కదా, రమేశ్ ఆమె వెంటపడి పెళ్లి చేసుకున్నాడు. వాడు కూడా చాలా స్మార్ట్‌గా ఉంటాడు. నీట్ షేవ్, టైట్ డ్రెస్, ఇంగ్లీషులో దంచేయడం వాడి గ్లామర్‌కి బోనస్ పాయింట్స్. సుమన అప్పుడు వలంటరీ టీచర్‌గా పని చేసేది. ప్రేమ అనేది ఎవరి మీద ఎప్పుడు ఎట్లా కల్గుతుందో ఎప్పటికీ రహస్యమే గద! నెల రోజుల్లోనే ఆమె రమేశ్ మీద విపరీతమైన అభిమానం పెంచుకున్నది. అతని పరిస్థితే అట్లే తయారైంది."

నాకు వెంటనే కౌస్తుభ గుర్తుకొచ్చింది.

"మా ఆఫీసూ, స్కూలూ పక్కపక్కనే. ఎం.డీ.ఓ తో రమేశ్‌కు మంచి

పరిచయం. తరచూ ఆఫీసు కొస్తూండేవాడు. మన మాటకారితనం నచ్చింది, ఫ్రెండైపోయిందు. ఓ రోజు డల్‌గా గనిపిస్తే సంగతేంటని ఆరా దీశాను..."

'అంటే నన్నూ అడిగినట్లే...' అనుకున్నా.

"అంతా చెప్పాడు. అప్పటికే తనకు పెళ్లైందనీ చెప్పాడు. ఈ మాత్రానికీ పరేషానీ ఎందుకు? సుమనతో నేను అన్నీ మాట్లాడ్తా నని నచ్చజెప్పాను. స్వయంగా వాళ్లింటికెళ్లి మాట్లాడాను. ఆమెకు తల్లి లేదు. అన్నయ్య ఎప్పుడు భారం దించుకుందామా అని చూస్తున్నాడు. నా ప్రయత్నం వెంటనే ఫలించింది..."

"మరి రమేశ్ భార్య అభ్యంతరం చెప్పలేదా?" నా అనుమానం

"ఆమెకు తెలిస్తే గదా!"

తప్పనిసరై ఉలిక్కిపడ్డాను.

"ఆమె పాత కాలం మనిషి. రమేశ్ వాళ్ల సొంత ఊరు మాల్. రోజూ డ్యూటీకొస్తున్నట్టే రావడం. అడపాదడపా ఇక్కడుండటం... చాలా రోజులు ఇట్లాగే సాగింది యవ్వారం."

"ఆమెకింకా తెలియలేదా?" సీరియస్‌గా అడిగాను.

పడీపడీ నవ్వాడు లింగం-" శివా! శివా! ఇంత అమాయకుడివేమయ్యా నీవు? ఇటువంటి విషయాలు తెలియకుండా ఎట్లా ఉంటాయి?" మళ్లీ నవ్వాడు.

"మరి అప్పుడేమయ్యింది?" నా గొంతులో ఆదుర్దా.

'ఏమవుతది? ఆవిడొచ్చి నానా గొడవ జేసే ప్రయత్నం చేసింది. నేనూరుకుంటానా? ఆవిడను శాంతపరచి, పురాణాలూ- ఇతిహాసాలూ చెప్పాను. పోయేది తన పరువేనని హెచ్చరించాను."

'ఆమె ఒప్పుకుందా?' అన్నట్టు చూశాన్నేను.

"ఏదైనా మనం చెప్పడంలోనే ఉంటుంది శివా! ఆమెకూ, వీళ్లకూ సర్దిచెప్పాను. ఖతమ్. ఎవరికి వాళ్లు సెటిలయ్యారు."

కొంచెం సేపు మౌనం తర్వాత, అతనే అన్నాడు మళ్లీ-"ఆ మధ్య రమేశ్‌కి దండుమైలారం ట్రాన్స్‌ఫర్ అయినట్టు తెలిసింది. అప్పటి నుండే మంచాల వెళ్లడం తగ్గిపోయినట్టుంది..."

బస్సు ఇబ్రహీం పట్నం చేరుకున్నది.

మేం దిగేసరికి హైదరాబాద్ బస్సొకటి సిద్ధంగా ఉంది. కాని, జనం కిటకిట లాడుతున్నారు. నేను ఎక్కేందుకు పరుగెత్తాను. మనకు ఇలాంటి బస్సుల్లో ప్రయాణం నిత్యం అలవాటే గదా!

"అరె... ఆగు భాయ్. ఇన్నిరోజులుగా సిటీలో ఉంటున్నావ్. బస్సుల యవ్వారం దెలీదా?" నా రెక్క పట్టుకున్నాడు లింగం. "సిటీకెళ్లడానికి బోలెడు బస్సులు రెండు ఫుల్‌గా వెళ్తే మూడోది నిల్‌గా ఉంటుంది. అయినా ఇప్పుడంత అర్జెంటేముంది? కౌస్తుభను కలిసేదుందా?" వంకరా నవ్వాడు.

గిల్టీగా అనిపించింది నాకు.

"ఆకలి దంచేస్తూంది శివా! బస్ స్టాండెదురుగా మిర్చీ హోటల్ ఉంది. చాలా కమ్మగా ఉంటాయ్... రా!" అటు దారి తీశాడు.

**"నిజమే శ్రీనూ! రెండిళ్ల కాపురం ఎలకకి ప్రాణసంకటం పిల్లికి చెలగాటంలా ఉంటుంది. అందరూ పైకి గొప్పగా అభినందిస్తున్నట్లు, సంతోషిస్తున్నట్లు నటిస్తారు. లోలోపల నవ్వుకుంటారు. నిజంగా అనుభవించేవాడికే తెలుస్తుంది అసలు బాధ!" అతని మాటలు గుండె లోతుల్లోంచి వస్తున్నాయ్.**

నాకు ఆకలిగా ఉంది. ఈ సమయంలో ఆ మిర్చీ ఎలా ఉన్నా రుచి బ్రహ్మాండంగా ఉంటుందని తెలుసు.

ఇద్దరమూ అక్కడికి చేరుకున్నాం. అది చిన్న స్టాల్. మొత్తం ఆరు టేబుళ్లున్నాయ్- రెండు వరుసల్లో స్టాల్ బయటే వేడివేడిగా మిర్చి తయారవుతున్నాయి. కడాయి లోంచి తీసినవి తీసినట్లే ఖాళీ అయిపోతున్నాయి. లోపల తింటున్నవాళ్లు గాక, పార్సిళ్లు పట్టుకెళ్తున్నవాళ్లూ బాగానే ఉన్నారు. మరి కొందరు అక్కడే నిలబడి తింటున్నారు- సిటీలో పానీ పూరీ బండిని తలపిస్తూ. నిజంగా దేశకాలమానాలతో సంబంధం లేకుండా సాగే నష్టం లేని బిజినెస్ హోటలే అనిపించింది నాకు.

రెండు ప్లేట్లు ఆర్డరిచ్చి ఓ సీట్లో కూర్చున్నాం.

మా వెనక సీట్లో కూర్చున్నవాళ్లు మిర్చీ తినడం పూర్తి చేసినట్లున్నారు. "దో చాయ్" అంటూ ఆర్డరిచ్చాడు అందులో ఒకరు.

మాకు మిర్చీ రావడానికి అధమం పది నిముషాలు పట్టేలా ఉంది. నా చెవులు వైయస్ రొదను ఇష్టపడటం లేదు. వెనకున్న వాళ్లు ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది.

"నీకేంటి శ్రీనూ! ఇంటా-బయటా మారాజువే నువ్వు..." ఇద్దరిలో ఒక గొంతు.

"మరి నీకు తక్కువేందేంటో? నేను ఒక్కింటికే మారాజుని, నువ్వు రెండిళ్ల రారాజువి కదా!"

మళ్లీ ఉలిక్కిపడాల్సొచ్చింది.

"వెక్కిరించడానికి నువ్వొక్కడివే తక్కువయ్యావనుకున్నా, హు! అదీ పూర్తయింది." నిట్టూర్చింది మొదటి గొంతు.

'ఛ! ఇక్కడా అదే సంభాషణా? 'రామేశ్వరం పోయినా... వదలనట్టు' అనుకుంటూనే వాళ్ల మాటలు మరింత శ్రద్ధగా వినసాగాను.

"అరె, అదేంటన్నా, అంత మాటన్నావ్?" రెండో గొంతు నొచ్చుకుంది-అతని పేరు శ్రీనివాస్ గావచ్చు.

"నిజమే శ్రీనూ! రెండిళ్ల కాపురం ఎలకకి ప్రాణసంకటం పిల్లికి చెలగాటంలా ఉంటుంది. అందరూ పైకి గొప్పగా అభినందిస్తున్నట్లు, సంతోషిస్తున్నట్లు నటిస్తారు. లోలోపల నవ్వుకుంటారు. నిజంగా అనుభవించేవాడికే తెలుస్తుంది అసలు బాధ!" అతని మాటలు గుండె లోతుల్లోంచి వస్తున్నాయ్.

ఇంతలో మా మిర్చీలు వచ్చేశాయ్. వాటి టేస్ట్‌ని ఆస్వాదించే స్థితిలో లేనిప్పుడు. అతని మాటలు అంత కంటే ప్రధానమైపోయాయి.

"రెండిళ్లకూ ఒకటే దీపం. ఒక ఇంట్లో కొస్తే ఇంకో ఇంట్లో చీకటి. ఆ చీకటి అక్కడున్న మనుషుల్లోని అనేకరుగ్మతల్ని బయటికి తీస్తుంది. ఆ విషజ్వాలల మధ్య నలిగిపోయేది మాత్రం కచ్చితంగా మగాడే.

ఒక్క కాపురంతోనే ఈ కాలంలో తలప్రాణం తోకకొస్తున్నది. ఇహ రెండైతే

వాని పరిస్థితెట్లా ఉంటుందో ఊహించుకో. పురాణాలూ-కథలూ వినడానికే బాగుంటాయ్. అనుభవించేవానికే అసలు కష్టాలు తెలుస్తాయ్..." మాట్లాడలేక ఆగిపోయాడతను.

"సారీ అన్నా...." ఆ శ్రీనివాస్ నొచ్చుకున్నట్లున్నాడు.

"అరె, నువ్వెందుకు శీనూ, సారీ జెబుతావ్? నువ్వు కొత్తగా అన్నదేమీ లేదు. చాలా మంది మనసులో ఉన్న మాటే- కాకపోతే నువ్వు పైకే అనేశావ్. కాని తదనంతరజీవితంలో ఇంత సంఘర్షణ ఉంటుందని ఆ నాడు ఒక్క క్షణం.... ఆలోచించినా ఈ తప్పటడుగు వేసేవాణ్ని కాదు తెలుసా? " క్షణమాగి మళ్లీ అతనే అన్నాడు-

"ఇప్పుడు ఇల్లంటే భయం, వెళ్లేసరికి రకరకాల సమస్యల కత్తులు నూరుకొని ఎటాక్ చేసేందుకు సిద్ధంగా ఉంటారు. మొదట్లో రెండో ఇంట కొంత ప్రశాంతత దొరికేది. పిల్లలే వద్దు అంటూ ఆదర్శాలు మాట్లాడిన ఆమె కూడా, ఇప్పుడు క్యారీయింగ్. మొదటింట పిల్లలు 'ఈ రోజెందుకు రావు? నిన్నెందుకు రాలేదు? ఎక్కడ తింటావ్? ఎలా ఉంటావ్...' అంటూ యక్షప్రశ్నలతో వేధిస్తుంటారు. ఇక వాళ్లిద్దరి మాటల్లో ఒకటే ధ్వని-నాకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని. ఇంట్లో కన్నీటి చుక్క రాలని రోజు ఉండదంటే నమ్ము. బయట రకరకాల ప్రాబ్లెమ్స్‌తో ఇంటికెళ్తే... అది నరకాన్ని తలపిస్తూంటుంది. ఇలాంటి బతుకు గడపలేక ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది..."

మళ్లీ ఉలిక్కిపడ్డా.

"అందుకే నిద్ర పోయే సమయానికే ఇంటికెళ్తా. మనసులోని ఆనందం-బాధ... ఏదైనా మనసులో సమాధి చేసుకోవాల్సిందే. అక్కడ నేను కేవలం యంత్రాన్నే ఆడుతూ- పాడుతూ కుటుంబజీవనాన్ని ఎంజాయ్ చేసే నేను, అవసరమైతే నోరు విప్పలేని స్థితి. మనసారా నవ్వు లేని దుస్థితి. నీలాంటి స్నేహితుల్తో పొద్దు పోయేదాక కాలక్షేపం చేయడం. అప్పుడప్పుడూ మందు తీసుకోవడం..." అతని కళ్లు చెమ్మగిల్లినట్టున్నాయి.

"కరెక్టే అన్నా. ఈ సమస్య బతికున్నప్పుడు మనల్ని తినేయడమే కాక, చచ్చింతర్వాత కూడా, మన తర్వాత మనుషులను పట్టి పీడిస్తుంది. ఆ సూర్య నారాయణ కేసు చూడటం లేదా?" అనునయంగా అన్నాడు శ్రీనివాస్.

వాళ్లు టీ తాగడం పూర్తయినట్టుంది. లేచి వెళ్తున్నారు.

"అరె... రమేశ్... బావగారూ!" గట్టిగా అరిచాడు లింగం నా పక్కనే-బాంబులా.

ఉలిక్కిపడక చస్తానా?

ఆ ఇద్దర్లో ఒకతను లింగాన్ని నమ్మలేనట్టు చూశాడు.

"నేను చెప్పలేదూ! ఆ రమేశ్ గారితనే..." వైయస్, చూయించాడు. మొహం వేయి ఓల్టుల బల్బైపోతూండగా.

"నమస్తే! నా పేరు శివకుమార్" చేయి తుడుచుకుంటూ కరచాలనం కోసం చాచాను.

"చూడు లింగం!" రమేశ్ సీరియస్‌గా అన్నాడు. తనకంటే పెద్దవాడన్న సాధారణ గౌరవాన్ని కూడా పాటించకపోవడమే అందుకు నిదర్శనం. "స్నేహితుడనేవాడు తన మిత్రునికి కష్టం గలిగినా, సరే మంచి సలహా ఇవ్వాలి. కాని, నీలా బతుకుల్ని బుగ్గి చేసే తప్పుడు సలహాలివ్వవద్దు...". "అరె, నేనేం జేశానయ్యా?" లింగం గొంతులో నిర్జీవం.

మర్యాద కోసం నా చేతిని మన్నించి, "బయట నిలబడతాం. టీ తాగి రండి!" అన్నాడు రమేశ్ చాలా కాజువల్‌గా.

రమేష్-లింగం చెప్పినంత గ్లామరస్‌గా లేదు.

మేము టీ తాగి, వాళ్లని కలుసుకున్నాం.

"అరె, నీ కోసం మంచాల వెళ్లొచ్చాం బావా! నువ్వేమో శ్రీకృష్ణపరమాత్మవి. ఎప్పుడెక్కడుంటావో తెలీదు..." తన సహజ ధోరణిలో వైయస్.

రమేశ్ మొహంలో రంగులు మారడం నేను గమనించాను.

" ఆఁ! ఏమేం చెప్పింది. మీ ముద్దుల చెల్లెలు?" అతని గొంతులో వ్యంగ్యం.

"అరె... మనిషి పూర్తిగా మారిపోయింది బావగారూ..." ఆశ్చర్యాన్ని వెళ్లబోశాడు లింగం.

"ఇదిగో! నా బతుకును కుంపటిలా మార్చేసిన మహానుభావుడితడే. పేరు వై. సోమ లింగం..." శ్రీనుకి లింగాన్ని పరిచయం చేశాడు రమేశ్.

ఈ సారి నాతో పాటు లింగం కూడా ఉలిక్కిపడ్డాడు.

"అదేంటి బావా, అలా మాట్లాడతావ్?" నొచ్చుకున్నాడు లింగం.

"చూడు లింగం!" రమేశ్ సీరియస్‌గా అన్నాడు. తనకంటే పెద్దవాడన్న సాధారణ గౌరవాన్ని కూడా పాటించకపోవడమే అందుకు నిదర్శనం. "స్నేహితుడనేవాడు తన మిత్రునికి కష్టం గలిగినా, సరే మంచి సలహా ఇవ్వాలి. కాని, నీలా బతుకుల్ని బుగ్గి చేసే తప్పుడు సలహాలివ్వవద్దు..."

"అరె, నేనేం జేశానయ్యా?" లింగం గొంతులో నిర్జీవం.

"మహానుభావా!" రెండు చేతులు జోడించాడు రమేశ్. "మాట్లాడకు. నువ్వు మహా మాటకారివని నాకు తెలుసు. నీకో దండం, నీ స్నేహానికో దండం! చేసిన మహోపకారం చాలు. నా బతుకు నాది గాకుండా చేశావ్. అది చాలు. నీలాంటి వెధవ సలహాకు బలైపోయిన ఓ లైవ్ ఎగ్జాంపుల్ చెప్పనా?. ఇక్కడే ఈ ఊళ్లోనే ఓ.యస్. రెడ్డి అనే ఓ ముసలాడున్నాడు. నిజానికి అతను ముసలాడు కాదు. ఇంకా సర్వీసులో ఉండేవాడు. కాని సరిగ్గా ఇలాంటి తప్పే చేసి. జీవచ్ఛవంలా తయారయ్యాడు. ప్రభుత్వాన్ని వదిలి. తనవాళ్లందర్నీ వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు. అతను చచ్చిపోయాడని. మొదటి అర్ధాంగి పెన్షన్ బెనిఫిట్ కూడా పొందుతూండగా. ఎవ్వరికో కనిపస్తే-మళ్లీ పట్టుకొచ్చారు. ఆ రెండో కుటుంబం అవస్థలు. అదీ స్థితి... నిజంగా పగవాడిక్కూడా వద్దు సుమా. నిజంగా పెద్ద మనిషివే అయితే. పెద్దరికం నిలబెట్టుకునే మంచి పనులు చెయ్. మంచి సలహాలివ్వు. చేతగాకపోతే నోర్మూసుకో అంతే కాని...."

అతనట్లా ఆవేశంగా, ఆవేదనతో మాట్లాడుతూంటే [illegible] లింగం మూగపోయాడు. అతడు ఒంటరివాడు కాకుండా నేనూ తోడుగా నిలిచాను- మౌనంలో. •